పొగమంచు

సీరియల్

ముద్దా సురేష్

(పధ్నాల్గవ భాగం)

డా॥ గ్రా-రాణా భుజం ఓదార్పుగా తట్టి యిన్స్ట్రు మెంట్ పానెల్ మీద తన దృష్టి లగ్నం చేశాడు.

తమ పొజిషన్ - అండర్ గ్రౌండ్ బేస్ కి రిపోర్టు చేశాడు. విష మేఘం పల్చబడుతోందని చెబుతూ తమకు తాజాగా ఎదురైన ప్రమాదాలు వివరించాడు.

రాణా చేతివాచి చూసుకుని తాము బయటికివచ్చి కేవలం నలభై నిముషాలు మాత్రమే అయిందని గ్రహించాడు. అతనిక్కి కొన్ని గంటలు గడిచినట్లుంది.

స్పీకర్లోంచి రహస్య స్థావరంనుండి వస్తున్న మాటలు శ్రద్ధగా వినసాగాడు రాణా.

"హెలో, డి. పి. వన్! బేస్ కాలింగ్ ....యువర్ రిపోర్టు ఎక్నాలెడ్జ్డ్. బొంబాయి పరిసర ప్రాంతాల్లోకి వేలాదిమంది జనం తరలిపోతున్నారు.

నగరం సరిహద్దులో యింటర్న్మెంట్ (ఖైదీల) కాంప్స్ ఏర్పాటు చేయబడ్డాయి. బొంబాయిచుట్టూ స్పెషల్ పోలీస్ మిలటరీ బలగం కాపలా ఉన్నాయి, విచ్చలవిడి రాకపోకల్ని నిరోధిస్తూ.

పట్టణం విడిచిపెట్టే జనాభాని వెంటనే ఖైదీలుగా చేయడం జరుగుతోంది వారి వ్యక్తిగత రక్షణకోసం. చాలామందికి యింకా ఉన్మాదం సోకలేదు. వారికివారే యిష్టపూర్వకంగా సైనికులకి లొంగిపోతున్నారు, తమలో ఉన్మాదం ప్రారంభమైనపుడు అధికారులు రక్షిస్తారన్న ఆశతో.

విషమేఘం మీదుగా పాట్రోల్ చేస్తున్న హెలికాప్టర్లు, మలబార్ హిల్స్ అవతల పార్సీటవర్స్ దగ్గర సముద్ర ప్రాంతంలో విషమేఘం ఉధృతంగా

ఉన్నట్టు రిపోర్ట్సు పంపాయి. ముఖ్యంగా డాక్ యార్డు పరిసరాల్లో విష మేఘం బాగా విస్తరించినప్పటికీ అంచుల్లో బలహీనమౌతున్నట్లు తెలుస్తోంది.

దేశం నలుమూలలా ఉన్న హెలికాప్టర్లన్నిటిలో కాల్షియం క్లోరైడ్ లోడ్ చేసి బొంబాయి నగరంమీద చల్లడాన్కి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే యిది ఆచరణలో పెట్టడాన్కి యింకా చాల గంటలు పడుతుంది.

యితర వివరాలు తెలియగానే మీకు తెలియజేయ బడుతుంది. గుడ్ లక్ అండ్ ఓవర్!”

డోగ్రా వైర్ లెస్ పరికరం స్విచ్ ఆఫ్ చేసి రాణా వైపు చూసాడు.

“మనం దారితప్పలేదు. సరియైన దారిలోనే ఉన్నాం. అది డాక్ యార్డు ప్రాంతంలో ఎక్కడో వుండి వుంటుంది.”

వారిద్దరూ యిప్పుడు మలబార్ మార్కెట్ లో ప్రయాణిస్తున్నారు.

డోగ్రా తిరిగి సౌండ్ స్విచ్ నొక్కాడు.

“వాడెవడో చూడు!” రాణా ఎదురుగా రోడ్డు మీద పొగమంచులోంచి బైటికి వస్తున్న ఆకారంవైపు చూపుడు వ్రేలితో చూపించాడు.

ఆ వ్యక్తి ఒక సర్దార్జీ.

దట్టమైన గడ్డం.

నగ్నంగా వున్నాడు.

చేతిలో ఖడ్గం ఊపుతూ వాన్ వైపు ఉరకబోతున్నాడు.

స్టీరింగ్ వీల్ బలంగా తిప్పుతూ వెంట్రుకవాసిలో

ప్రమాదాన్ని తప్పిస్తూ అతని ప్రక్కగా టర్నింగ్ కొట్టాడు రాణా.

రాణా ఏమాత్రం అలస్యం చేసినా, సర్దార్జీ టాంకు వాహనం క్రింద పచ్చడి అయివుండేవాడు.

రాణా ప్రక్క తలుపులోంచి చూసాడు ఆ వ్యక్తి కోసం.

కాని అప్పటికే అతను పొగమంచులో మాయ మయ్యాడు.

వాన్ మలుపు తిరిగి యిరుకైన సందులోకి ప్రవేశించింది. విండ్ మిర్రర్ పై పేరుకుపోతున్న పొగమంచును తిట్టుకుంటూ కళ్ళు పెద్దవి చేసుకొని ముందుకు చూస్తున్నాడు డోగ్రా.

వాన్ తిరిగి విశాలమైన మెయిన్ రోడ్డులోకి ప్రవేశించింది, మలబార్ మార్కెట్ ని వొదిలిపెట్టి.

యాభై అడుగులు ప్రయాణించకముందే రాణా సడన్ బ్రేక్ తో వాన్ ని ఆపేశాడు.

"అక్కడ చూడు" అన్నాడు రాణా రోడ్డుకు కుడి వేపు చూపిస్తూ. పొగమంచులోంచి కళ్ళు పెద్దవిచేసుకుని చూసాడు డోగ్రా.

అతను ఆమెను స్పష్టంగా చూడకముందే కెవ్వున ఆమె పొలికేక వినబడింది.

ఆమెకు పదిహేను సంవత్సరాలకంటే ఎక్కువ వయసు ఉండదు.

ఓ గుమ్మంలోకి భయంగా ఒదిగి నిలబడిందామె.

అంతదూరంలో కూడా భయాందోళనలతో వెడల్పయిన ఆమె కళ్ళు కనబడుతున్నాయి రాణా, డోగ్రాలకి.

ఆమె పెట్టే పొలికేకలు వాన్ స్పీకర్ల ద్వారా

లోపలిభాగంలో భయంకరంగా ప్రతిధ్వనిస్తున్నాయ్.

యిద్దరు బలిష్ఠులైన వ్యక్తులు నవ్వుతూ ఆమెవేపు అడుగులేస్తున్నారు.

వారి భుజాలమీద, చేతులమీద బురద పేరుకుని వుంది, వారి ఆకారాలకు మరింత భయంకరాకృతిని కల్పిస్తూ.

వారిద్దరూ పెద్ద కంఠంతో బూతులు తిడుతూ ముందుకు అడుగులేస్తున్నారు. ఆమె లేత శరీరాన్ని కొద్ది క్షణాల్లో ఏం చేయబోతారో ఆమెకు పచ్చిగా చెబుతూ.

"బాస్టర్డ్స్!" పళ్ళు పటపట కొరికాడు రాణా. ఉద్రేకంతో.

"లుక్ హియర్ సర్! వాహనం విడిచి మనం బైటికి వెళ్ళడానికి వీల్లేదు. ఈ లోహపు దుస్తులో నేనే విధంగానూ సహాయం చేయలేను. యికపోతే - మీ ప్రాణాలు ప్రస్తుతం చాల విలువైనవి. ఎవరు కష్టంలో వున్నా మనం మజిలీలు చేసుకుంటూపోతే, అసలు మనం న్యూక్లియస్‌ను చేరలేం...."

"షటప్" అన్నాడు రాణా నెమ్మదిగా.

అతని కాలు యాక్సిలేటర్ మీద బలంగా పడింది. ఒక్క కుదుపుతో ముందుకు ఉరికింది వాహనం.

వాన్ కుడివేపు చక్రాలు ప్లాట్‌ఫాం అధిరోహించగా, తారాజువ్వలా ముందుకు కదిలింది వాన్.

ఆ యిద్దరు దృఢకాయులు త్రుళ్ళిపడి వాన్ వేపు చూసారు.

అప్పటికే ఆలస్యమైంది.

వాన్ మిలటరీ టాంకులా వారిద్దర్నీ ఢీకొంది. ఒక

దృఢకాయుడు, వాన్ చక్రాలకింద మాయమయ్యాడు. రెండో వ్యక్తి శరీరం బొమ్మలా ఎగిరి, ఎదురుగా వున్న బిల్డింగ్ గోడకు విసురుగా గుద్దుకుంది.

ఆ యిద్దరి వ్యక్తుల ఆఖరి ఆర్తనాదం, యువతి భయంతో పెట్టిన పొలికేక రాణా మెదడులో ప్రతి ధ్వనించాయ్.

కీచుగా శబ్దం చేస్తూ ఆగింది వాన్.

ఆ కుదుపుకి డోగ్రా, ఎదురుగా వున్న ఇన్స్ట్రుమెంట్ పానెల్ మీదకు తూలిపడ్డాడు.

రాణా ప్రక్క కిటికీలోంచి బైటికి చూసాడు.

ఆ యువతి ముఖానికి చేతులడ్డం పెట్టుకొని, పరిగెడుతోంది పొగమంచులోకి.

రోడ్డుకడ్డంగా, విగతజీవుడై, పచ్చడైన శరీరంతో పడివున్న దృఢకాయుడి శరీరాన్ని చూసాడు రాణా.

మరో వ్యక్తి శరీరం, గోడవారగా పడివుంది వంకర తిరిగిన మెడతో, విచిత్రమైన యాంగిల్ లో.

ఆ భీకర దృశ్యాన్ని చూడలేక రాణా దృష్టి మరల్చుకొని, స్టీరింగ్ వాన్ మీద తల ఆన్చాడు వొక చేత్తో నుదురు రుద్దుకుంటూ, క్రిందికి శూన్యంగా చూస్తూ....

డోగ్రా ముందుకు కదిలి రాణా భుజం ఊపాడు సున్నితంగా.

రాణా ఏమీ మాట్లాడకుండా, తలపైకెత్తి నెమ్మదిగా వాహనాన్ని ముందుకి పోనిచ్చాడు.

దార్లో ఎదురౌతున్న మరికొన్ని విషాద సన్నివేశాలు గమనిస్తూ వాళ్ళిద్దరూ మౌనంగా ప్రయాణిస్తున్నారు....

డోగ్రా, అప్పుడప్పుడు రహస్య స్థావరానికి రిపోర్టులు పంపుతున్నాడు, తాము చూస్తున్న సన్నివేశాల

గురించీ.

పంటల గురించీ,....

జన నష్టం గురించీ,....

అకస్మాత్తుగా అడిగాడు డోగ్రా, రాణాని వెంటనే వాన్ ఆపుజేయమని. రాణాకి, తాము యిప్పుడు ఎక్కడ ఉన్నదీ స్పష్టంగా అర్థంకాలేదు.

డాక్ యార్డుకి సమీపాల్లో ఎక్కడో వున్నట్టు ఊహించాడు అంతే.

రాణా ప్రశ్నార్థకంగా డోగ్రావైపు చూసాడు.

"మనం యిప్పుడు న్యూక్లియస్ ఉనికిని కోల్పోయాం" అన్నాడు డోగ్రా విచారంగా.

అతను చకచకా ఇన్‌స్ట్రుమెంట్స్ చెక్ చేసి, రహస్య స్థావరాన్కి రిపోర్టు చేసాడు వేగంగా, క్లుప్తంగా.

"ఎలా?" అన్నాడు రాణా.

"విష మేఘంపైన తిరిగే హెలికాప్టర్ ద్వారా మనం గైడ్ చేయబడ్తున్నాం" చెప్పాడు డోగ్రా "మైక్రో ప్లాస్మా ఉనికిని ట్రాక్ చేస్తూ ఆ హెలికాప్టర్‌లో సెన్సర్ యంత్రాలు పనిచేస్తాయి. అప్పుడు హెలికాప్టర్ లోని సిబ్బంది ఆ న్యూక్లియస్ ఎక్కడవుందో, ఎటువైపు కదుల్తోందో హెడ్ క్వార్టర్స్‌కి చెప్తారు వాళ్ళు. మన వాన్‌లోని దిక్సూచిని అక్కడ్నించే ఆపరేట్ చేస్తారు.

మనం ఏ దిక్కుగా వెళ్లాలో, ఏ ప్రాంతంలో, వెళ్ళాలో ఈ దిక్సూచి తెలుపుతుంది. యిప్పుడు ఈ దిక్సూచి అకస్మాత్తుగా పనిచేయడం మానేసింది."

అంతలో స్పీకర్ నుండి ఓ కంఠం, కాబిన్‌లో ప్రతిధ్వనించసాగింది.

"హల్లో, డి.వి. 1 బేస్ హియర్ ఎగైన్. డు యు

రీడ్?”

డోగ్రా ఎక్నాలెడ్జ్ చేయగానే, ఆ కంఠం కొనసాగింది. కాప్టర్ టూ న్యూక్లియస్ ఉనికిని అకస్మాత్తుగా కోల్పోయిందని చెప్పడానికి విచారిస్తున్నాం. హెలికాప్టర్లోని యంత్రాలు న్యూక్లియస్ ఉనికిని అకస్మాత్తుగా కోల్పోయాయట. వాళ్లు మళ్ళీ న్యూక్లియస్ కనబడేవరకూ చుట్టుప్రక్కల ప్రాంతాల్లో సెర్చిచేస్తారు. అది అకస్మాత్తుగా ఎలా మాయమైందో మాకు అర్థం కావడంలేదు. డాక్యార్డు దగ్గర సముద్రంలో దాక్కుని ఉంటే తప్ప.... మీరు ఆ ప్రాంతానికి దగ్గర్లోనే వున్నారు.... కాని అలా జరిగివుండకపోవచ్చు. మీరు యిప్పుడు చేయాల్సిన పని ఓర్పుగా వాన్లో కూర్చోవడమే! మళ్ళీ మేము సూచనలు యిచ్చేవరకూ. ఎక్కువసేపు పట్టదు. అయామ్ ష్యూర్. ఓవర్ అండ్ ఔట్.”

డోగ్రా సీట్లో వెనక్కి జారబడ్డాడు “గాడ్!”

“మనం విషమేఘం గుండెకాయకి దగ్గర్లోనే ఉన్నాం.”

“వాళ్ళు మళ్ళీ దాన్ని లొకేట్ చేయగలరంటావా?” అడిగాడు రాణా.

“ఎవరికి తెలుసు? యింతకుముందు యిలాగే ఓసారి కాంటాక్టు కోల్పోయారు,” చుట్టూ యిబ్బందిగా చూస్తూ అన్నాడు డోగ్రా.

“మళ్ళీ ఆర్డర్స్ ఎప్పుడు వస్తాయో ఏమో? మనం యిలా ఓపెన్గా ఉండడం మంచిది కాదు.”

“ఆల్ రైట్! రోడ్డుమధ్యగా ఉండటం ప్రమాదమే. అక్కడేదో బిల్డింగ్ షెల్టర్ ఉన్నట్టుంది. అక్కడకు పోదాం.”

నెమ్మదిగా రోడ్ క్రాస్ చేస్తూ వాన్ని కుడివైపు

నడపసాగాడు రాణా.

సరిగ్గా అదే సమయంలో....

పొగమంచులోంచి రాక్షసుడిలా—ఓ బస్సు బయటికి వేగంగా దూసుకువచ్చింది!

ముందుభాగంలో రక్తపు మరకలతో ....

ఆ బస్సు యిప్పుడు తిన్నగా వాన్ వైపు తారా జువ్వలా పరిగెడుతోంది....

డ్రైవర్ ఉద్దేశాన్ని ఊహిస్తూ, త్వరగా రోడ్డు వొదిలిపెట్టే ఉద్దేశంతో గాభరాగా రాణా యాక్సిలేటర్ నొక్కాడు.

అప్పటికే ఆలస్యమైంది....

కనురెప్పపాటున దఢాలున గుద్దుకుంది వాన్ ప్రక్క భాగాన్ని ఆ బస్.

పర్వతంలాంటి ఆ తాకిడికి, రాణా డ్రైవ్ చేస్తున్న వాన్ రివ్వున పైకెగిరి తలక్రిందులుగా నేలమీద లాండయింది.

ప్రపంచం వొక్కసారిగా చీకటైంది.

• • •

ఆ ఉదయాన, రెండోసారి తల తిరిగినట్లయింది డాలేఖాకి. నాలుగైదు రోజులుగా తను కొద్ది గంటలు మాత్రమే నిద్రపోయానన్న విషయం ఆమెకు తెల్సు. కాని తాను నిర్విరామంగా శ్రమించక తప్పదు. లెక్కపెట్టలేనన్ని జీవితాలు, తనమీద, తన సహచరుల మీద ఆధారపడి వున్నాయి.

ప్రమాదకరమైన ఈ విషమే ఘం వ్యవహారంలో రాణా ఒక్కడూ ప్రభుత్వం చేతిలో పావులా ఉపయోగ పడుతున్నందుకు విచారించిందామె.

అసలు పొరపాటు వారిది.

కాని వాళ్ళు చేసిన పొరపాటు సరిదిద్దుకోడాన్కి రాణాని ఉపయోగించుకుంటున్నారు.

"కాని, అది తప్పనిసరి" లోలోన అనుకున్నది జులేఖా. రాణా తప్పక శాస్త్రజ్ఞులకు సహాయం చేయ గలడు, మైకోప్లాస్మా శాంపిల్ తెచ్చి కివ్వడం ద్వారా.

జులేఖా ఎదురుగా వున్న రిపోర్ట్ మీద దృష్టిని కేంద్రీక రించడాన్కి ప్రయత్నించింది.

తాము యింతకుముందు ఓ పేషంట్ పై చేసిన రేడి యోలజీ ట్రీట్ మెంట్ చక్కని ఫలితాన్నిచ్చింది!

అదృష్టవశాత్తూ ఆ వ్యక్తిని సరియైన టైంలో తమ వద్దకు చేర్చడంవల్ల.

మిగతా పేషంట్లు అంత అదృష్టవంతులు కాక పోవచ్చు.

ఇది యింకా ప్రారంభ దశ మాత్రమే.

విష మేఘం బాధితులు యింకా వందల్లో, వేలల్లో, లక్షల్లో వస్తారు.

దాదాపు ప్రపంచం అంతా భారతదేశానికి సహా యంగా నిలిచింది.

ఇతరదేశాల సైంటిస్టులు అనేకమంది అప్పుడే ఇండియా వచ్చారు.

కారణం—యిలా రేపు ఎక్కడైనా జరగొచ్చు.

ఏ ఖండంలో, ఏ దేశంలోనైనా విష మేఘం ప్రమాదం ఏర్పడవచ్చు.

యిలాంటి అనుకోని ప్రమాదాలు ఏర్పడినప్పుడు, వారు కూడా యితర దేశాల సహాయం ఆశిస్తారు సహజంగా

యిప్పుడు బయటవాళ్ళు తమకు అభయ హస్తం యిస్తున్నట్లుగానే.

'అలాటి భారీ సహాయం వచ్చే మరికొద్ది రోజుల్లో మరీ అవసరం' అనుకున్నది జులేఖా.

* * *

తల దిమ్మును వొదిలించుకోడాన్కి తీవ్రంగా తల విదిలించసాగాడు రాణా.

నొప్పి ఉధృతం కావడంతో ఆ ప్రయత్నం మధ్యలో విరమించాడు. షాక్ నుండి తేరుకోడానికి ప్రయత్నిస్తూ, అతను అలాగే చతికిలబడి ఉన్నాడు కొద్దినిముషాలపాటు.

నెమ్మదిగా కళ్ళు తెరిచి ప్రకాశవంతమైన సూర్యకాంతిని చూసి ఆశ్చర్యపోయాడు రాణా.

ఎక్కడ్నుంచో ఓ కంఠం విన్పిస్తోంది....

అసహజంగా వున్న ఆ కంఠం ఆతృతతో, కంగారుగా పలుకుతోంది ...

తల భారంగా పైకెత్తి, పరిసరాలు కలియజూసాడు రాణా.

అతన్ని ఆశ్చర్యపరుస్తూ, కొద్ది అడుగుల దూరంలో స్పెషల్ వాన్ తలక్రిందులుగా పడివుంది.

తెర్చుకున్న, కాబిన్ లోంచి వినవస్తోంది ఆ కంఠం....

అది రేడియోలో వచ్చే కంఠం అని గుర్తించగలిగాడు రాణా.

భూగర్భ రహస్య స్థావరం డిమాండ్ చేస్తోంది, ఏం జరిగిందో తెల్సుకోవడాన్కి.

వాన్ లోంచి తను 'తూలి' బయటపడి ఉండాలి! బస్సు, వాన్ కి ఢీకొనగానే తలుపు స్మాష్ అయివుండాలి. తలక్రిందులవుతుండగా, ఆ వొత్తిడికి తలుపు తెర్చుకొని

ఉండాలి, తనను రోడ్డుమీదకు విసిరేన్నూ.

తన శరీరంలో ఎముకలు ఏమీ విరిగినట్లు లేదు. ముఖం భగభగ మండుతోంది, ఎవరో రోడ్డుమీద ముఖం వ్రేలాడుతుండగా లాక్కెళుతున్నట్లు.

మోకాళ్ళు పచ్చిపుళ్ళులా, గాయం మీద కారం అద్దినట్టు మండుతున్నాయి.

ఆ డామేజి మినహా, తను క్షేమంగానే ఉన్నట్టు గ్రహించాడు రాణా.

డోగ్రా?

డోగ్రా ఎక్కడ ఉన్నట్టు??

రాణా శరీరంలో యింద్రియాలు వేగంగా అదుపులోకి వచ్చాయి. చేతిని రోడ్డుమీద మోపుతూ కూర్చోగలిగాడు రాణా.

మెల్లగా స్పెషల్ వాన్ వైపు తిరిగాడు.

'అతను యింకా లోపాలే చిక్కుకుపోయి ఉండాలి' తనలోతను అనుకున్నాడు.

భగవాన్!

అతనికేం ప్రమాదం లేదుగదా?

వణుకుతూ పైకిలేచి నిలబడ్డాడు.

తూలుకుంటూ కాబిన్ వైపు నడిచాడు....

"డోగ్రా!" పిల్చాడు చీకటిగా వున్న కాబిన్‌లో తలదూర్చి.

లోపలంతా ఖాళీ!!!

గిర్రున వెనక్కి తిరిగాడు రాణా. వాహనాన్ని ఆధారంచేసుకు నిలబడుతూ.

"డోగ్రా!...."

పిల్చాడు మళ్ళీ—ఈసారి గట్టిగా.

అప్పుడు చూసాడు రాణా—ఆ ఆకారాన్ని.

డోగ్రా పడుతూ, లేస్తూ, వాన్‌కి దూరంగా నడుస్తున్నాడు—నడుందాకా వంగిపోయి, రెండు చేతులతో ముఖాన్ని కప్పుకొని—బాధలో ఉన్నట్లుగా.

అతను ఎట్టటి బస్సు వున్న దిక్కుగా అడుగులేస్తున్నాడు....ఎక్కడికి వెళ్తున్నాడో తెలిసో, తెలియకుండానో....

డోగ్రా ఆకారం, బస్సును సమీపిస్తోండగా, కొంత మంది జనం, ప్లాట్‌ఫాం దిగుతూ అతనివైపే కన్నార్పకుండా చూస్తూ నిలబడ్డారు మౌనంగా.

ఆ గుంపులో ఒకడు చేత్తో డోగ్రాని చూపిస్తూ, కిచకిచ నవ్వాడు.

"డోగ్రా....కమ్ బాక్!" గాభరాగా అర్చాడు రాణా, అతను మాస్క్ హెల్మెట్ లేకుండా నడుస్తూ—పొగమంచుకి బహిర్గతమౌతున్నాడని గ్రహించి....

కాని డోగ్రాకి అతని మాటలు వినపడలేదు. కాలు జారి మోకాలి మీద పడ్డాడు డోగ్రా, యింకా బస్సు లోంచి దిగుతున్న జనం ముందుగా.

జనంలో చాలామంది, అతని అవతారాన్ని చూసి పగలబడి నవ్వసాగారు, చేత్తో చూపిస్తూ.... తోటి ప్రయాణికుల్ని డోగ్రా అవస్థ చూడ్డానిక్కి రమ్మని పిలుస్తూ.

బస్సు ముందు భాగం, షాపులోకి చొచ్చుకుపోయి ఉంది.

కాని ఓ ఆకారం, ఆ శిధిలాలనుండి మెల్లగా బయటికి వచ్చింది, ముక్కలైన విండ్ మిర్రర్ లోంచి.

తర్వాత ఆ ఆకారం, బస్సునానుకుంటూ నిలబడింది ఆయాసంతో.

అతను రోడ్డు ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ యూనిఫాం ధరించి ఉన్నాడు.

నుదుటిమీంచి రక్తం ధారగా కార్తోంది.

అతను పళ్ళు బయటపెట్టి గర్వంగా నవ్వుతున్నాడిప్పుడు.

రాణా ముందుకి కదిలాడు ఆందోళనగా, డోగ్రాకి హెచ్చరిక చేయడాన్కి.

కాని అతని పాదాలు సహకరించలేదు.

మోకాళ్ళలో పట్టుసడలి జారిపడ్డాడు రాణా, బాధగా మూల్గుతూ.

జనం కేసి చేయి చూపుతూ డోగ్రాని కేకపెట్టి హెచ్చరించాడు రాణా.

కాని అతన్ని అక్కడ పట్టించుకునే వాళ్ళెవరూ లేరు.

ఒంటికాలిమీద చతికిలబడి, నాభిలోంచి వస్తున్న మూలుగుతో, బాధగా అటూ ఇటూ వూగుతున్న డోగ్రా మీద నిలబడి వున్నాడిప్పుడు డ్రైవర్.

ఆ దృఢకాయుడు తన బూటుకాలిని రివ్వున వూపి, వెనక్కి జరిగి పగలబడి నవ్వాడు—ముద్దగా వెనక్కి తూలి పడిన ఆకారం కేసి చూస్తూ.

ఎవరో ముందుకి అడుగేసి, మళ్ళీ ఆకారం కడుపులో బలంగా తన్ని వెనక్కి నడిచారు.

మిగతా జనం నవ్వులో శృతి కలిపారు.

ఉన్నట్టుండి అకస్మాత్తుగా యేదో రహస్యమైన ఒప్పందాన్కి వచ్చినట్లుగా, ఆ జనమంతా ముందుకు వంగి వున్న ఆ శరీరం చుట్టూ గుంపుగా చేరి మూకుమ్మడిగా కుళ్ళబొడవనారంభించారు.

"నో!....నో!...." పొలికేక పెట్టాడు రాణా.

కాని యెవరూ అతని ఉనికిని గ్రహించలేదు.

వారంతా హింసాకాండను నిర్విఘ్నంగా కొనసాగించడంలో నిమగ్నమైపోయారు.

రాణా ఆశ్చర్యం మేరకు, లోహపు గుస్తులను ధరించిన డోగ్రా కాళ్ళమీద, చేతులమీద ఆనుకుంటూ కదిలాడు.

ఒక్క క్షణం డోగ్రా కళ్ళు దూరంగా వున్న రాణాని గుర్తించాయి.

కాని, ఆధారంగా నేలమీద మోపిన అతని చేతుల్ని ఎవరో భద్రాల్న తన్నారు, డోగ్రా నోరు తెరవకముందే.

బహిర్గతంగా ఉన్న డోగ్రా తల, కాంక్రీట్ రోడ్డుకి తక్కున కొట్టుకుంది.

అతను రోడ్డుమీద బోర్లా సాగిలపడిపోయాడు చలన రహితంగా.

గుంపు మధ్య నవ్వులు-వికటాట్టహాసాలుగా మారాయి.

వారంతా అతని శరీరంమీద నిలబడి తన్నుతూ, పొడుస్తూ, కుమ్ముతూ ప్రాణాన్ని బైటికి వెడలగొట్టించే ప్రయత్నం చేయసాగారు అమానుషంగా.

కట్టలు తెంచుకున్న ఉద్రేకంతో, దశదిశలు దద్దరిల్లేట్లు సింహగర్జన చేస్తూ మెరుపులా ముందుకి కదిలాడు రాణా గుంపుని ఛేదిస్తూ.

పిచ్చివాడిలా అరుస్తూ, దొరికినవాడినల్లా నేల కరిపిస్తూ, ఫుట్‌బాల్‌లా తన్నుతూ, జనాన్ని చెల్లాచెదరు చేయసాగాడు రాణా.

ఆ హఠాత్పరిణామానికి ఒక్కక్షణం వారందరిలో భయం ఆవహించింది.

అతను తమలాంటి వ్యక్తి కాదని గుర్తిస్తూ, దూరంగా

జరిగి నిలబడిపోయారు వాళ్ళంతా భీతితో.

అందరూ....

ఒక్క డ్రైవర్ తప్ప!

రాణా కళ్ళకు ఆడుగు దూరంలో వున్న డోగ్రా మృతదేహం కనబడుతోంది.

బిగుసుకు పోయిన ముఖంతో డోగ్రా కనురెప్పలు మూయబడి వున్నాయి.

నోటి నుంచి రక్తం ధారగా చారిక కట్టి వుంది. అతని ప్రక్క టెముకలు విరిగి, ఊపిరితిత్తుల్లోకి చొచ్చుకుపోయాయని చెప్పడానికి అది ఖచ్చితమైన సూచన.

ఆ ప్రమాదం యాక్సిడెంట్ లో జరిగిందో, ఉన్మాదుల చిత్రహింసలవల్ల జరిగిందో రాణాకు పూర్తిగా అర్థం కాలేదు.

అతనికి అర్థమైందల్లా ఒకటే! అతనిలాగానే తనను కూడా చంపేదాకా ఈ ఉన్మాదులు విడిచిపెట్టరు.

రాణామీద యేదో బరువు హఠాత్తుగా పడింది.

ఓ బూటుకాలిదెబ్బ కడుపులో లాండయి రాణాని వెల్లకితలా పడగొట్టింది.

రాణాకి ఒక్కక్షణం ఎదురుగా వున్న ఆకారం కనబడింది, పొగమంచుతో కూడుకున్న ఆకారం.

పొగమంచులోంచి కొంతమంది తలలు తనవైపు చూస్తూ కనబడ్డాయి, గుంపువాళ్ళు చుట్టుముడుతుండగా.

వాళ్ళంతా తనను బలికాపోతున్న మేకలా చూస్తున్నారు కసాయివాళ్ళలా నవ్వుతూ.

రాణా గుండెలు పీచుపీచుమంటున్నాయి. పిచ్చి కుక్కల బోనులోకి విసిరినట్లయింది అతని పరిస్థితి.

దృఢకాయుడి ముఖం—రాణా ముఖంమీదికి వాలింది.

అతని చేయి రాణా జుట్టును చేజిక్కించుకుని పైకి క్రిందికీ కుదిపింది. అతని చూపులు సూటిగా రాణా ముఖంలో నిల్చాయి.

బాధతో అప్పుడు చూశాడు రాణా స్పష్టంగా, ఆ కళ్ళల్లోని ఉన్మాదసిత్థి—పైశాచిక ఆనందం....

అకస్మాత్తుగా రాణాకి గుర్తొచ్చింది పిస్తోలు!

మెల్లగా చేతిని కోటులోపలి షోల్డర్ హోల్‌స్టర్ వైపుకు పోనిచ్చాడు రాణా.

సేఫ్టీ కాచ్ లూజ్ చేస్తూ, పిస్తోలుని జాగ్రత్తగా బయటకి తీసుకొచ్చాడు రాణా.

అంతే!

చిన్న బారెల్‌ని—బస్ డ్రైవర్ గడ్డాన్కి నొక్కిపెట్టి, ట్రిగర్ నొక్కాడు....కసిగా.

"ఢాం"....డ్రైవర్ తల బాంబులా పేలింది. రక్తంతో కూడిన మాంసఖండాలు, ఎముకలు గాల్లోకి రివ్వున వెదజల్లబడ్డాయ్.

ఛిద్రమైన తలతో, డ్రైవర్ మొండెం వెనక్కి కూలిపోయింది.

రివ్వున పైకిలేచాడు, రాణా పిస్తోలు మరోసారి పేల్చడాన్కి సన్నద్ధమౌతూ. కాని ఆ అవసరం అతనికి కలగలేదు.

ఉన్మాదుల గుంపు బొమ్మల్లా నిల్చిపోయింది, ముద్దలా పడి చివరి ప్రాణాలతో కొట్టుకుంటున్న డ్రైవర్ శరీరాన్ని తదేకంగా చూస్తూ.

మెల్లగా వెనక్కి అడుగు వేయసాగాడు రాణా, ఉన్మాదుల గుంపునుంచి దృష్టి మరల్చకుండా.... ఏక్షణంలోనైనా వారినుండి రియాక్షన్ కోసం ఎదురు చూస్తూ.

చాలమంది తమ ముఖాల మీదకి చిమ్మిన రక్తాన్ని తుడుచుకుంటూ రక్తసిక్తమైన చేతులు ఆశ్చర్యంగా పరిశీలించుకుంటున్నారు.

ఆ గుంపులోని ఓ ఎర్రచీర యువతి.... చేతి కంటిన రక్తాన్ని నాకడం గమనించాడు రాణా, వెనక్కి అడుగు లేస్తూ.

ఆమె చూపులు అటూ ఇటూ ప్రసరించి, తన సహచరులమీద నిల్చాయి.

తర్వాత నేలమీది శవాలవైపు....తర్వాత వెనక్కి నడుస్తున్న రాణావైపు.

కోపంతో గుర్రుమంటూ వెలువడింది ఓ పొలికేక ఆమె నోటి నుండి!

రాణా వెనక్కి తిరిగి పరుగు లంకించుకున్నాడు.

బస్సుకి దూరంగా....

గుంపుకి దూరంగా....

శవాలకి దూరంగా....

స్పెషల్ వాన్‌కి దూరంగా....

....పొగ మంచులోకి.

వెనకనుంచి కేకలు వినబడుతున్నాయి....

వాళ్లు వెంట తరుముతున్నారని గ్రహించాడు రాణా. అతని మోకాళ్ళు యింకా కలుక్కుమంటున్నాయి నొప్పి రేగగొడుతూ....యాక్సిడెంట్ ప్రతిఫలం....

కాని తను ఆగడాన్కి వీల్లేదు....

ఆగితే తను మళ్ళీ చంపాలి.

తర్వాత తనని వాళ్ళు చంపుతారు.

పిస్తోలులో ఎనిమిది గుళ్ళే వుంటాయి.

పొగమంచులో పరిగెడుతున్నాడు రణా వొగరుస్తూ.

ఎక్కడ్నించో ఓ కారు దూసుకుంటూ వచ్చి అతని ముందు సడన్ బ్రేక్‌తో 'కయ్యి'న శబ్దం చేస్తూ ఆగింది.

ఆ హఠాత్పరిణామాన్ని నిలదొక్కుకోలేక తూలి బానెట్ మీద పడ్డాడు రాణా.

అది ఓ పాతబడ్డ ఫియట్ కారు.

చాలాచోట్ల తుప్పుపట్టి వుంది.

కాని కార్లో జీవం యింకా వుంది.

బానెట్ మీంచి దొర్లి, డ్రైవర్ డోర్ వైపు ఉరికాడు రాణా. దఢాలున తలుపు తెర్చి, లోపలి వ్యక్తిని రాణా బైటకు లాగపోతుండగా మాటలు వినబడ్డాయి.

"దయచేసి నన్ను వొదిలి పెట్టండి.... ఈ పిచ్చివాళ్ళ నుండి నన్ను దూరంగా పోనీండి...."

తటపటాయించాడు రాణా.

తల వొంచి స్టీరింగ్ ముందున్న వ్యక్తివేపు పరిశీలనగా చూసాడు.

అతనికి వయస్సు నలభై వుంటుంది.

ఖరీదయిన దుస్తులు ధరించాడు.... మెడకు నెక్ టై.

అన్నిటికంటె ముఖ్యం....అతని కళ్ళు అర్థిస్తున్నట్లుగా భీతిల్లినట్లుగా కనబడ్డాయ్.

ఉన్మాద వ్యాధి లక్షణం అతని చూపుల్లో కనబడ్డం లేదు.

ఆ వ్యక్తి రాణావైపు దీనంగా చూసాడు.

"ప్లీజ్ లెట్ మీ గో...." మళ్ళీ అభ్యర్థించాడు.

అడుగుల చప్పుడు దగ్గరయింది.... కేకలు దగ్గరయ్యాయి.

"ప్రక్కకి జరుగు!" కమాండింగ్‌గా అన్నాడు రాణా వణుకుతున్న అతన్ని ప్రక్కకు తోసి తను డ్రైవింగ్

సీటు ఆక్రమించుకుంటూ. డోర్ మూసి, ఫస్టు గేర్ వేసి కారుని ముందుకి వురికించాడు రాణా.

తృటిలో ప్రమాదం తప్పింది రాణాకి.

అప్పటికే అక్కడికి చేరి కారు తలుపులకి వేలాడుతున్న ఉన్మాదులు, వాహనం ఒక్క జర్కుతో ముందుకు కదలడంతో ప్రక్కలకు విసిరివేయబడ్డారు.

ఓ ఆకారం దారి కడ్డంగా రావడంతో కారు ప్రక్క భాగం ఢీకొని రివ్వున యెగిరి గోడకు గుద్దుకుంది.

స్పెషల్ వాన్ తిరగబడ్డ స్థలాన్ని చేరుకోగానే ఫియట్ ప్లాట్ ఫాం ఎక్కి కీచుగా అరుస్తూ 'U' టర్న్ కొట్టింది.

ఉన్మాదుల గుంపు భయం యిక లేదని నిర్ధారించుకున్నాక కారు వేగం తగ్గించాడు రాణా పొగమంచులో మరో కార్ని గుద్దుకుంటానేమోనన్న భయంతో.

తన చేతిలో పిస్తోలు యింకా అలాగే ఉన్నట్లు, దాని వంకే ఫియట్ యజమాని తదేకంగా చూస్తున్నట్లు గ్రహించాడు రాణా.

పిస్తోలు తిరిగి హోల్స్టర్‌లో అమర్చి, రిలీఫ్‌గా వదిలిన ఆగంతకుడి నిట్టూర్పును విన్నాడు.

"నువ్వు మిగతావాళ్ళలాంటివాడివి కాదు. అవునా?" అడిగాడతను భయం భయంగా.

రాణా తల త్రిప్పి అతనివేపు చూసాడు.

భయంగా చూస్తూ, అతను దూరంగా జరిగాడు ఎడమ తలుపుదాకా.

అతని మొహం తెల్లగా పాలిపోయి వుంది.

"మిగతావాళ్ళలా.... అంటే?" అడిగాడు రాణా, జాగ్రత్తగా.

"యూ నో....మాడ్....అందరూ పిచ్చివాళ్ళయ్యారు. ఆ విష మేఘంవల్ల....దయచేసి నువ్వు అలా కాలేదని చెప్పు.... టెల్ మీ యు ఆర్ ఓ. కే!....నాలాగే...."

ఇది ఎలా సంభవం?

మరోసారి అతని ముఖంలోకి దేనినో వెతుకుతున్న వాడిలా చూసాడు రాణా.

అతనికి ఉన్మాదం సోకకపోవడం ఎలా సంభవం? అతను సాధారణంగానే కనబడుతున్నాడు.

బెదురు చూపులు........

"నేను పిచ్చివాడ్ని కాదు" చెప్పాడు రాణా తన జవాబుకు తనే ఆశ్చర్యపోతూ.

ఇన్ని విచిత్ర సంఘటనలు చూసిన వ్యక్తి వున్మాదిగా మారకుండా వుండగలడా?

ఆగంతకుడు నవ్వాడు. "థాంక్ గాడ్" అన్నాడతను సంతృప్తిగా. "నేను ప్రతినిముషం ఓ పీడకలలా గడుపుతున్నాను. పిచ్చివాడిగా మారకుండా నేనొక్కడినే మిగిలానని యింతవరకూ అనుకున్నాను. నాకు ఎదురయిన హృదయవిదారక సంఘటనలు చెబితే నువ్వు నమ్మవు...." చెమ్మగిల్లిన కళ్ళను చేత్తో తుడుచుకున్నాడతను.

"నా....భార్య నన్ను హతమార్చడానికి ప్రయత్నించింది. ఉదయం మేం బ్రేక్‌ఫాస్టు తీసుకుంటున్నాం. విష మేఘం అంటే ఏమిటో....దాని ఆకారం ఏమిటో మేము గ్రహించలేదు....దాని అర్థం మాకు తెలీదు. అది ఏర్పడానికి కారణం తెలేదు. మేము విన్న విష మేఘం మాకు తటస్థపడలేదు....మాహిమ్ దుర్ఘటన తాలూకు పొగ మంచు.... నేను తలెత్తి చూసాను....ఆమె ఎదురుగా

కూర్చొని వుంది.... నావేపు కన్నార్పకుండా చూస్తూ.... పెదవులపై ఆహ్లాదకరమైన నవ్వుతో.... ఎందుకు నవ్వుతున్నావని అడిగాను. జవాబు చెప్పలేదామె. యింకా నవ్వింది. ఆమె కళ్ళు.... ఆమె చూపుల్లో చాలా మార్పు వొచ్చింది.... కళ్ళు పెద్దవి చేసుకొని చూస్తోంది.... నిజానికి ఆ చూపులు మామూలుగా లేవు...." అతను శబ్దం కాకుండా వెక్కి వెక్కి ఏడ్వడం ప్రారంభించాడు.

"ఆఁ.... అది మహా దారుణం.... ఇట్ వజ్ హారిబుల్" గుండెల నిండుగా గాలిపీల్చుకొని కొనసాగించాడు ఆగంతకుడు.... "ఆమె పైకిలేచి టేబుల్ చుట్టూ నడిచి నా వెనక్కి చేరింది. ఆమె చేతిలో పళ్ళుకోసే బాకువున్నట్లు నాకు తెలీదు. ఏదో అడగాలని వెనక్కి తిరిగాను. అప్పుడు చూసాను ఆమె కత్తిని విసురుగా కిందకు దింపడం. నే.... నేను చాల అదృష్టవంతుడ్ని.... బాకు నా భుజంలో గుచ్చుకుని మడతబడింది. అప్పుడు గ్రహించాను నేను అసలు కారణం—

విష మేఘం....

దానికి కారణం విష మేఘమేనని గుర్తించాను.

నేను జంప్ చేసాను. యిద్దరూ కలియబడ్డాం.... ఆమెను దెబ్బతీయడం నా ధ్యేయంకాదు. కాని.... భగవాన్! ఆమెలో విచిత్రమైన శక్తి ప్రవేశించింది. అంతకుముందు ఆమె ఎంతో సున్నితంగా ఉండేది, నా భార్య—కాని అకస్మాత్తుగా ఆమెలో పైశాచిక బలం ప్రవేశించింది. నన్ను టేబుల్ మీదకి పడదోసింది. అక్కడే యిద్దరూ పోరాడాం.... జుట్టూ జుట్టూ పట్టుకుని నేలమీద పడేదాకా....

పడిపోవడంలో ఆమె తల పగలకొట్టుకుంది.... స్పృహ

కోల్పోయింది.... నాకు ఏం చెయ్యాలో తోచలేదు.... కాళ్ళు చేతులు ఆడలేదు...." అలసటగా ఆగిపోయాడు ఆగంతకుడు. అతని శరీరం గతాన్ని గుర్తుచేసుకుంటూ బలహీనంగా కంపించసాగింది....

"టేక్ యిట్ ఈజీ" అన్నాడు రాణా ఓర్పుగా, ఆగంతకుడి పరిస్థితికి లోలోన జాలిపడుతూ.

ఉదయం — యిలాంటి అనుభవాలే ఎన్నివేలమందికి ఎదురయ్యాయో....

ఎన్నివేలమంది ప్రేమికులు, ఒకరిపై ఒకరు కలియబడ్డారో పరస్పరం హతమార్చుకోవడానికి....

తమను తాము చంపుకున్న ప్రజలు ఎందరో?....

"ఆ విషయం గురించి అస్తమానూ గుర్తుచేసుకుని బాధపడొద్దు" చెప్పాడు రాణా, "నిన్ను ఒక సురక్షిత ప్రదేశానికి చేర్చడానికి ప్రయత్నిస్తాను."

ఆగంతకుడు కన్నీళ్ళు అదుపులోకి తెచ్చుకుంటూ తలెత్తి రాణావైపు చూసాడు. "లేదు. ఆ విషయం గురించి మాట్లాడి బాధపడ్డం నాకూ యిష్టంలేదు. నాకు తోడుగా దొరికిన సాధారణ వ్యక్తివి నువ్వొక్కడివే. నేను ఓదార్పు కోసం, సహాయం కోసం యితరుల దగ్గిర పోతూ ప్రయత్నించాను. కాని వాళ్ళంతా ఒక్కటే! అందరూ పిచ్చివాళ్ళే.... కాని.... కాని.... మనం ఎందుకు పిచ్చివాళ్ళం కాలేదు? దాని ప్రభావం మనల్ని ఏమీ చేయలేకపోయింది ఎందువల్ల?"

రాణా తటపటాయించాడు.

త్వరలో వ్యాధి తను యిద్దరికీ సోకుతుందని చెప్పాలా? అతి త్వరలో—ఆ వ్యాధి తనతోపాటు అతని మెదడు కణాలని కూడా నాశనం చేస్తుందని చెప్పాలా?

పారసైట్ కణాలు తమ సంఖ్య పెంచుకోడానికీ, ప్రభావం చూపించడానికీ, తీసుకునే సమయం మనిషికీ మనిషికీ తేడా ఉంటుందని చెప్పాలా?

బహుశా ఈ అగంతకుడ్ని—సమయం మించిపోయే లోగా డాక్టర్ జులేఖాకు అప్పగిస్తే ఉపయోగం ఉంటుందేమో.

"నువ్వు బయలుదేరేముందు నీ భార్యని జాగ్రత్తగా బంధించావా? ఐ మీన్ ....ఆమెకు ఆమె అపకారం చేసుకోకుండా!" అడిగాడు రాణా, రోడ్డువైపు జాగ్రత్తగా చూస్తూ, భూగర్భ రహస్య స్థావరానికి ప్రయాణమౌతూ.

"ఓహ్! ఆమెను నేను వొదిలిపెట్టలేదు" జవాబిచ్చాడు అగంతకుడు ...."రోజీని నేను వొదిలిపెట్టలేను... ఆమె అంటే నా కెంతో అనురాగం....ప్రాణం.... బైటివారి దయాదాక్షిణ్యాలకు వదిలిపెట్టి ఆమెను బంధించి ఎలా వచ్చెయ్యగలను?....

"....బట్ యు సీ....అసహ్యంగా చూసే ఆమె చూపులు....ప్రేలాపన....పిచ్చివాగుడు.... నేను సహించలేక పోయాను....

"ఆమెను ఒంటరిగా వొదిలి ఎలా పారిపోగల్ను? రోజీ నాకు చాల విలువైనది....అందుకే నాకూడా తీసుకువచ్చాను....ఆ విధంగా చూడకుండా....ఆ విధంగా అసహ్యంగా మాట్లాడకుండా చేసి, ఆమెను బాక్ సీట్లో ఉంచాను. అదిగో ఆమె!....స్వీట్ రోజీ....నీ వెనకనే ఉంది... బాక్ సీట్లో...."

రాణా చటుక్కున వెనక్కి చూసాడు.

అంతే! ప్రక్కలో బాంబుపడ్డట్టు అదిరిపడ్డాడు రాణా. కళ్ళు చీకట్లు కమ్మినట్లూ, చెరణాకోలతో ఎవరో

బాదినట్లుగా....ఫీలయ్యాడు....

ఆమె....శిరశ్ఛేదన చేయబడింది!!

"ఫ్రెండ్! .. యు....సీ....ఆమెను నేను వొంటరిగా వొదిలిపెట్టలేకపోయేను...." ఆగంతకుడు నిర్వికారంగా తాపీగా చెప్పుకుంటూ పోతున్నాడు.

"రోజీ పలికే మాటలు నేను సహించలేకపోయాను. ఆమె చూపులు భరించలేకపోయాను.... అందుకే.... 'రంపం' ఉపయోగించాను. నిజాన్ని చెప్పాలంటే.... ఆ పని నిర్వర్తించడం చాల కష్టమైంది....సామానంతా చిందరవందరైంది....ఎలాగో పని ముగించాక, బట్టలు మార్చుకోక తప్పలేదు....ఆ పని చేస్తున్నంత సేపూ.... బెచారీ....వాగుతూనే ఉంది....పని ముగిసేసరికి ఆమె-మాటలు ఆపడం తప్పలేదు." ఆగంతకుడి కంఠం విచారంగా పలికింది "కాని ఆమె ఆ విచిత్రపు చూపులు చూడ్డం మాత్రం మానలేదు....తల బైటికి లాగేసినా సరే....పిచ్చిదానిలా అలా చూస్తూనే ఉంది—చూడు కావాలంటే! యిప్పటికీ ఆమె అదే విధంగా చూస్తోంది" ఆగంతకుడు వెనక్కి తిరిగి, సీటుమీంచి వంగి, క్రింద దేనిగురించో వెతికాడు.

తర్వాత చేయి పైకెత్తాడు.

రాణావైపు గంభీరంగా చూస్తూ అన్నాడు. "చూడు! నామాట అబద్ధమనుకుంటే...."

అతను చేతో రక్తం ఓడుతున్న స్త్రీ తలకాయను జుట్టుతో పట్టుకొని, రాణా ముఖం మీదకు ఊపాడు.

అతను చెప్పింది నిజమే! ఆమె కళ్ళు తదేకంగా చూస్తున్నాయ్!!

రాణా భయంకరంగా అర్చాడు; బిక్కచచ్చిపోయి

వెనక్కి జరుగుతూ.

అతని వెన్నులోంచి చలిపుట్టుకొచ్చింది....

శరీరంమీద రోమాలు నిక్కబొడుచుకున్నాయ్. పిచ్చిగా అరుస్తూ గాల్లో ఊగుతున్న తలకాయను విసిరి కొట్టాడు రాణా.

రోడ్డుప్రక్క షాపుల్ని గుద్దుకోబోతున్న కారుని అతి కష్టంమీద కంట్రోల్ లోకి తెచ్చాడు, చెమటలుకక్కుతూ.

రాణా ప్రక్కనున్న వ్యక్తి ఆశ్చర్యంగా చూసాడు, తన భార్య తలకాయని అతను విసిరికొట్టినందుకు.

"నా రోజీని కొడతావా? ఉం....కొడకా!" అరిచాడు ఆగంతకుడు తలకాయని మళ్ళీ తన ఒళ్ళో సున్నితంగా దాచుకుంటూ.

తిరిగి వెనక సీట్లోకి వొంగాడతను, ఒళ్ళో వున్న తలకాయ దొర్లి పడకుండా ఎడంచేత్తో పట్టుకుంటూ.

ఈసారి అతని చేయి పైకివచ్చింది రక్తశిక్తమైవున్న రంపంతో—

"మై తుఝ్ఝే మార్ దూంగా సాలే...." గర్జించాడు ఆగంతకుడు.

"మిగతా వాళ్ళలాగే నువ్వు పిచ్చాడివి!" అంటూ పదునైన పళ్ళతో మెరుస్తున్న అంపాన్ని రాణా మెడ వెనుక మోపాడు.

కాని కారు అకస్మాత్తుగా పేవ్ మెంట్ కి గుద్దుకొని దానిమీదుగా దూసుకుపోడంతో ఆ కుదుపుకి ఆగంతకుడు వెనక్కి తూలాడు.

అంపం రాణా భుజంమీంచి జారి క్రిందపడింది.

కారు బ్రేకులు కాళ్ళతో నొక్కుతూ, పిడికిలి బిగించి ఆగంతకుడి దవడమీద గాకెట్ పేల్చాడు రాణా.

కీచుమంటూ ఆగింది ఫియట్.

రాణా దడాలున తలుపు తెరిచి—పైకిలేస్తున్న ఆగంతకుడి కాళ్లు పట్టుకుని నిర్దాక్షిణ్యంగా రోడ్డుమీదికి ఈడ్చాడు.

కాంక్రీట్ రోడ్డుమీద ఠప్పున తాకింది ఆగంతకుడి తల.

మాడిపోయిన బల్బులా, స్పృహతప్పాడు ఆ ఉన్మాది.

అతనితోపాటు దొర్లుకుంటూ రోడ్డుమీద పరిగెత్తింది అతని భార్య తల!

భయంకరమైన చూపులతో, రోడ్డుకడ్డంగా పడివున్న ఆ శిరస్సును, తప్పించుకుంటూ కారుని తిరిగి వేగంగా ముందుకి పోనిచ్చాడు రాణా. ఆలోచనలతో అతని మస్తిష్కం వేడెక్కిపోతోంది.

రెండు నిముషాల తర్వాత తాను చీకటిలో కప్పివేయబడ్డట్టు గుర్తించాడు రాణా.

ఎదురుగా దారి సరిగా కనబడ్డంలేదు.

చీకటి!

బ్రేక్స్‌ని అదిమాడు రాణా.

బలహీనంగా అరుస్తూ అంధకారంలో ఆగిపోయింది వాహనం.

రాణా చుట్టూ చూసాడు భయంగా....

ఎదురుగా—తనకటూ ఇటూ—పూర్తి అంధకారం.

కార్లోని మొండెం గురించిన ఆలోచనలు బలవంతంగా మస్తిష్కంలోంచి త్రోసిపుచ్చాడు రాణా.

ముఫ్ఫై అడుగుల వెనకాల బలహీనంగా ఓ వీధి దీపం వెలుగుతోంది.

ఏం జరిగిందో క్రమంగా అర్థమైంది రాణాకి.

తాను పల్లంలోకి వచ్చినట్లు గుర్తు!

అఁ! పరధ్యానంగా తాను ఓ టన్నెల్‌లోకి డ్రైవ్

చేసాడు. తనకుముందే ఆ విషయం తెలియవల్సింది.

కాని, కార్లోని మొండాన్ని ఎలా వదిలించుకోవాలా అని ఆలోచిస్తూ అన్యమనస్కంగా ఈ మార్గంలోకి వచ్చేసాడు.

దగ్గర్లో డాక్ యార్డు ఉండాలి.

యిది సముద్ర కోస్తా ప్రాంతం.

పెద్ద నల్లరాతి కొండ—లోభాగాన తొలిచిన త్రోవ.

"బ్లాక్ రాక్ టన్నెల్!" గట్టిగా అరిచాడు రాణా.

ఖచ్చితంగా అదే అయ్యుండాలి.

పరధ్యానంలో తను మెయిన్ రోడ్డు వదిలిపెట్టి ఏటవాలు త్రోవగుండా వచ్చాడు—టన్నెల్ లోకి.

మెయిన్ రోడ్డులో హెవీ ట్రాఫిక్ ని తగ్గించడానికి ఈ త్రోవను దొల్చారు కొండలో.

నిజానికి ఆ కొండలో రెండు టన్నెల్స్ ఉన్నాయి సమాంతరంగా.

కాని రెండూ, వేరువేరుగా దూరంలో ఉన్నాయి అదే కొండలో.

వన్ వే ట్రాఫిక్!

మహాలక్ష్మి. బ్రీచ్ కాండీ ప్రాంతాలనుండి, వర్లీ—ష్వర్, మలబార్ పోర్టుప్రాంతాలకి వెళ్ళేవారికి మొదటి త్రోవ ఉపయోగపడుతుంది. అలాగే యిటునుంచి ఉత్తరం దిక్కుగా ప్రయాణించేవారికి రెండో టన్నెల్ ఉపయోగపడ్తుంది.

మొదటి భూగర్భ త్రోవ, బ్లాక్ రాక్ హిల్ లో 1960 లో దొల్చబడింది. రెండో టన్నెల్ 1971 లో నిర్మించబడింది.

రాణా—బొంబాయి ఉత్తర దిక్కుగా వెళ్ళడాన్కి

ఉపయోగించే పాత టన్నెల్‌లో ఉన్నాడు.

తను వెనుదిరిగి దక్షిణానికి వెళ్ళేముందు, చేయవల్సిన పని గుర్తుచేసుకున్నాడు రాణా.

తన వెనక సీట్లో పడివున్న ఆ భయంకరమైన మొండాన్ని వదిలించుకోవాలి.

రాణా కుడివైపు తలుపుతీసి, క్రిందికి దిగాడు.

డ్రైవింగ్ సీటు ముందుకు ఎత్తి, చేయి లోపలికి పోనిచ్చాడు రాణా.

అతను నిరభ్యంతరంగా, కార్లో లైటువేసుకుని ఆ పని పూర్తి చేయవచ్చు.

కాని తలలేని ఆ స్త్రీ మొండాన్ని వెలుగులో చూడదల్చుకోలేదు రాణా.

ముక్కై అడుగుల వెనుక, రోడ్డుమీదుంచి వస్తున్న అర్థ కాంతి చాలు.

బంధించబడిన కాళ్ళు తగిలాయ్ చల్లగా, రాణా చేతులకి.

చిన్న కుదుపుతో పైకెత్తాడు శరీరాన్ని....

రాణా ఆమె కాళ్ళుతప్ప మరెక్కడా ముట్టుకోలేదు.

తలలేని భుజాలు తాకితే తనకు వెంటనే వాంతి అవుతుందని అతనికి తెలుసు.

రాణా ఆ మొండాన్ని తేలిగ్గా ఎత్తి టన్నెల్ గోడవారగా దింపాడు.

ఆ భయంకర స్పర్శను మర్చిపోవడం కోసం, అతను చేతులు బట్టలకు రుద్దుకున్నాడు.

టన్నెల్ లోపలికి యధాలాపంగా చూసిన రాణా ఉలిక్కిపడ్డాడు.

తను ఊహించుకుంటున్నాడా?

లేక అక్కడ నిజంగా దీపపు కాంతి కనబడిందా? ఆ అండర్‌గ్రౌండ్ త్రోవ అంతా పొగమంచుతో కమ్ముకుని ఉంది. చీకటికి కళ్లు అలవాటుపడ్డాక నిర్ధారించుకున్నాడు రాణా.

దూరాన్నుంచి సన్నని కాంతి ఒస్తోంది.

సందేహంలేదు.

టన్నెల్ వంకర మలుపులో అది రిఫ్లెక్ట్ అవుతోంది.

అది పగటికాంతి కావడాన్కి వీల్లేదు.

ఎందుకంటే దాని 'అవతలివైపు' ప్రవేశ ద్వారం అర మైలు దూరంలో ఉంటుంది.

టెన్నెల్‌లో మార్గం వంపులు తిరిగివుంటుంది కూడా. అందుచేత సూర్యకాంతి అంత లోపలికివచ్చే ప్రసక్తిలేదు.

ఒక విధంగా జరిగివుండాలి.

ఏదో కారు లోపల ఆగి ఉంటోంది హెడ్‌లైట్ల కాంతితో. తను కార్లో దానికి ఎదురుపడ్డం క్షేమంకాదు. నడిచివెళ్ళి ఆ విషయం తెల్సుకురావాలి.

రాణా ఆ నిశ్శబ్ద వాతావరణంలో, జాగ్రత్తగా పల్లంలోకి నడవసాగాడు—ఆ భయంగొలిపే వెలుగువైపు.

అతను ముందుకు నడిచేకొద్ది—ఆ వెలుగు పెద్దది కాసాగింది....

విచిత్రమైన లేతపసుపుకాంతి అది!

రాణాకి మరాఠా దుర్గంలోని వెలుగు గుర్తుకు రాసాగింది.

పరిచయమున్న, ఒక వింత భయం రాణాని ఆవహించసాగింది....

రాణాకి క్రమంగా—ఆ కాంతికి మూలకారణంపై అనుమానం ఉదయించింది.

అతని గుండె వేగం హెచ్చింది.

ముందుకు వెళ్ళేకొలదీ ఊపిరిపీల్చడం కష్టమౌతోంది..

సన్నని, పదునైన వాసనని పసిగడుతూ టన్నెల్‌లోని వొంపు తిరిగాడు రాణా, అర్థచంద్రాకారంలో ఉన్న గోడని ఆధారం చేసుకుని నడుస్తూ....

మలుపు తిరిగి ఆగిపోయాడు రాణా.

టన్నెల్‌లోని మిగతా భాగమంతా వెలుగుతో ప్రకాశిస్తోంది!

ప్రయోగాలకు బలై, విషపూరితమైన మైకోప్లాస్మా! తను కనుక్కున్నాడు!!

విషమేఘం గుండెకాయని తను వెతికి పట్టుకున్నాడు!! హెలికాప్టర్‌లో యంత్రాలు ఎందుకు సఫలీకృతం కాలేదో యిప్పుడు అర్థమైంది రాణాకి.

దాదాపు భూగర్భంలో దాక్కుని ఉండటంవల్ల—హెలికాప్టర్‌లో యంత్రాలు దాని ఉనికిని పసిగట్టలేక పోయాయి.

అలా జరగడం సాధ్యమేనా?

తనకుతానుగా విషమేఘం యిందులో దాక్కోవడం!

నో, అది హాస్యాస్పదంగా ఉంది.

అయినా తను కనుక్కున్నాడు మొదటిసారి, మైకోప్లాస్మా ఆ మరాఠా కట్టడంలో దోబూచులాడుతుండగా.

కాని వాళ్ళు దాని ఉనికిని తిరిగి కోల్పోయారు!

ఇది నిజంగా ప్రమాదవశాత్తూ యిక్కడ చిక్కుకుందా? ఈ మానవ నిర్మితమైన గుహలాంటి షెల్టర్‌లో.

చాల నిముషాలు అలాగే ఉండిపోయాడు రాణా, వెలుగులోకి తదేకంగా చూస్తూ—దానికిగల ఆకర్షణ శక్తికి లోబడి ముందుకుపోవాలనే కోరికను బలవంతంగా

అణుచుకుంటూ.

అతని మెదడులో చిన్న భాగం తీవ్రమైన ఒత్తిడి తెస్తోంది. ముందుకుపోమని.... ఆ వెలుగులోకి.

కాని అది ఎంత ప్రమాదకరమో గుర్తు తెచ్చుకుని బలవంతంగా వెనక్కి అడుగేశాడు రాణా.

శక్తివంతమైన సితిలో ఉన్న ఆ మైక్రోప్లాస్మా వద్దకు చేరితే తన పూర్వపు వ్యాధి నిరోధక శక్తి సన్నగిల్లి తప్పక తిరిగి పిచ్చిపడుతుందని అతనికి తెల్సు.

ఎవరో హెచ్చరించినట్లుగా రాణా అకస్మాత్తుగా వెనక్కి పరిగెట్టాడు కారువైపు.

తళుక్కున మెరిసింది అతని మెదడులో ఓ ఆలోచన!

యిక ఆలస్యం చేయలేదు రాణా.

ఫియట్ లోకి జంప్ చేసి, యింజన్ ఫైర్ చేసి, లైట్లు వేయకుండా కారుని టన్నెల్ ద్వారంవైపు రివర్స్ చేసాడు రాణా.

* * *

రాణా—అటూ ఇటూ నడిచే పిచ్చివాళ్ళకు కనబడకుండా ఓ షాపు లోపలి భాగంలో వేచివున్నాడు. రోడ్డు మధ్యగా, తలక్రిందులుగా పడివున్న స్పెషల్ వాన్ అతనికి స్పష్టంగా కనబడుతోంది.

రోడ్డుమీద పొగమంచు యిప్పుడు పల్చబడింది. గాలికి పసుపుతనం మాయమౌతోంది.

రాణా—తిరిగి వెనక్కి, యాక్సిడెంట్ జరిగిన స్థలాన్ని చేరుకోవడంలో అత్యంత శ్రద్ధతీసుకున్నాడు—అతను స్పెషల్ వాన్ లోని వైర్ లెస్ యంత్రం చేరుకోడం మీదే భవిష్యత్తు ఆధారపడి వుంది గాబట్టి.

ప్రభుత్వ పథకం అమలు జరగాలంటే అతనికి వెను

వెంటనే భూగర్భ రహస్య స్థావరం నుండి సహాయం కావాలి. కొన్ని పరికరాలు కూడా.

బ్లాక్ రాక్ టన్నెల్ నుండి, రాణా చేసిన తిరుగు ప్రయాణంలో మళ్ళీ ఎన్నో ఆటంకాలు ఎదురయ్యాయి.

అయితే రాణా, అతి మెలుకువతో, ఏ గందరగోళం లోను కలుగజేసుకోకుండా వేగంగా స్పెషల్ వాన్ తిరగబడ్డ స్థలాన్ని చేరుకున్నాడు.

రాణాకు తట్టిన కొత్త ఐడియా చాలా సింపుల్.

సైంటిస్టు విశ్వామిత్ర చే మార్పులు చేయబడ్డ ప్రమాద కరమైన మైకోప్లాస్మా వొకసారి భూమిలో బంధించ బడింది చాల సంవత్సరాల పాటు.

యిప్పుడు అది తిరిగి—మరో మానవ నిర్మితమైన భూగర్భ త్రోవలో చిక్కుకుంది. అందుకే.... ఆ త్రోవకు అటూ ఇటూ వున్న మార్గాల్ని మూసివేస్తే?

కొండలో దొల్చబడ్డ గుహలో తిరిగి భూస్థాపితమై పోతుంది విష మేఘం గుండెకాయ!

యిక అప్పుడు ఏ ప్రమాదమూ లేదు.

అందుకే—రాణా తిరిగి స్పెషల్ వాన్ ప్రమాదాన్కి గురి ఐన స్థలాన్ని చేరుకున్నాడు.

వైర్ లెస్ సాధనాన్ని ఏ పిచ్చివాడు పాడుచేయ లేదని తెల్సుకుని రాణా ఎంతో సంతోషించాడు.

రాణా అక్కడికి చేరేటప్పటికి అది యింకా శబ్దం చేస్తోంది (ఓ కంఠం ప్రభుత్వ భూగర్భ రహస్య స్థావరంనుండి గాభరాగా పలుకుతోంది పది నిముషాల కోసారి—వాహనంలో ఉండే రాణా, డోగ్రాలేమై నారో తెలియక—ఆందోళనతో.)

తిరిగి రాణా కంఠం వినిపించగానే బేస్ (BASE)లో ఉండే అధికార్ల ఆనందానికి పగ్గాల్లేవు.

రాణా యిచ్చిన ఇన్‌స్ట్రక్షన్స్‌ని వెంటనే ఎక్నాలెడ్జ్ చేసారు.

అతని ఉపాయాన్ని అభినందించారు.

రాణా—గనుల త్రవ్వకానికి ఉపయోగించే శక్తివంతమైన డైనమైట్లనీ, ఓ ఎక్స్‌ప్లోజివ్స్ నిపుణుడినీ వెంటనే స్థావరంలో ఉన్న రెండో స్పెషల్ వాన్ ద్వారా తనవద్దకి పంపమని కోరాడు.

తనెక్కడున్నాడో వారికి వివరించి చెప్పాడు. శరవేగంతో ఈ ఏర్పాట్లు చేయమని కూడా ఆదేశించాడు.

అటువైపు కంఠం—రాణాని ప్రమాదం కలగకుండా సురక్షిత ప్రదేశంలో తాము వచ్చేటప్పటికి ఎంత సేపయినా సరే ఎదురుచూస్తూ కూర్చోమని అభ్యర్థన చేసింది.

అతనిని ఎవరైనా ఎటాక్ చేస్తే వెంటనే కాల్చి చంపామని మరోసారి గుర్తుచేసింది.

రాణా నవ్వుకున్నాడు.

యిప్పుడు అతనికి—చంపడం బాధాకరంగాలేదు.

ఉన్మాదులపై జాలి చూపించి ఉపయోగం లేదని అతనికి అప్పటికే పూర్తిగా అర్థమైంది.

* * *

రెండు గంటల తర్వాత పొగమంచును చీల్చుకుంటూ ప్రవేశించి ఆ రోడ్డుమీద ఆగింది రెండవ డివాస్టేషన్ వెహికల్!

రాణా తలుపు తెర్చుకుని, తను దాక్కున్న షాపులో నుండి బైటికి వచ్చాడు. (ఇంకా వుంది)